సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 20 । జూన్ । 2023



తోటకు వెళ్లి..

వృద్ధ దంపతులు మంటల్లో చిక్కుకుని చనిపోయారు. ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. - 8లో



మారిన బతుకులు

ఆపరేషన్ పరివర్తన్–2.0 కొందరి బతుకులు మార్చింది. వారు కొత్త జీవితాలు ప్రారంభించారు. - 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	33°	26°
ఇచ్ఛాపురం	35°	25°
పాతపట్నం	34°	25°
శ్రీకాకుళం	34°	25°

న్యూస్‌రీల్

గణేష్‌కు దాతల చేయూత



గణేష్‌కు ఆర్థిక సాయం చేస్తున్న పేడాడ శ్రీరామ్మూర్తి

సాక్షి ఎఫెక్ట్...

జి.సిగడాం : అంతుచిక్కని వ్యాధితో బాధ పడుతున్న జాడ గ్రామానికి చెందిన పదేళ్ల కుర్రాడు యాకల గణేషకు దాతలు చేయూత అందిస్తున్నారు. బాలుడి పరిస్థితిపై ఈ నెల 18న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన దవళపేట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, న్యాయవాది పేడాడ శ్రీరామ్మూర్తి కొంత మొత్తాన్ని ఆర్థిక సాయంగా అందజేశారు. జాడ గ్రామానికి వెళ్లి బాలుడి తల్లిదండ్రులకు డబ్బులు అందించారు. మరికొందరు ఫోన్ పే ద్వారా ఆర్థిక సాయం చేశారు. తమ కుమారుడికి సాయం చేయాలని అనుకునే వారు 70320 79299 నంబర్‌ను సంప్రదించాలని తల్లిదండ్రులు శంకరరావు, సీత కోరుతున్నారు.

వేరు శనగ విస్తీర్ణం పెంచేందుకు కృషి



రైతులతో ముఖాముఖిలో పాల్గొన్న నీతి ఆయోగ్ డిప్యూటీ డైరెక్టర్ అనురాధ

కోటబొమ్మాళి: వేరు శనగ సాగు విస్తీర్ణం, దిగుబడులు పెంచేందుకు కృషి చేయాలని నీతి ఆయోగ్ డిప్యూటీ డైరెక్టర్ బి.అనురాధ రైతులు, వ్యవసాయాధికారులకు సూచించారు. కోటబొమ్మాళి మండలం వాండ్రాడ గ్రామంలో సోమవారం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. వేరుశనగ సాగు విస్తీర్ణం, ప్రభుత్వ తోడ్పాటుపై రైతులతో చర్చించారు. విస్తీర్ణంతో పాటు దిగుబడులు పెంచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏడీలు ఎస్.గోవిందరావు, ఇందుమతి, వాండ్రాడ వ్యవసాయ సహాయకుడు ఏఎస్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్పీ స్పందనకు 33 వినతులు



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : స్పందన ఫిర్యాదులను వారం రోజుల్లో పరిష్కరించాలని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 33 మంది నుంచి వినతులు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్పీతో పాటు ఫిర్యాదులు అందుకున్నవారిలో అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు (క్రైమ్), జె.తిప్పేస్వామి (అడ్మిన్) ఉన్నారు.

సమస్యలు సత్వరం పరిష్కరించాలి



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్పందన, ఏపీ సేవ, మీ సేవ కింద అందిన అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ మురళీకృష్ణ, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ అర్జీలు స్వీకరించారు. ఈ వినతులను సకాలంలో పరిష్కరించాలని జేసీ ఆదేశించారు. జగనన్నకు చెబుదాం వెబ్‌సైట్ ద్వారా, జగనన్నకు చెబుదాంలో 1902 నంబర్‌కు ప్రజలు సమస్యలను చెబుతున్నారని, వాటిని గడువులోగా పరిష్కరించాలని చెప్పారు. రీ సర్వే పూర్తయిన సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, డీఎస్‌ఓ వెంకటరమణ, డ్వామా పీడీ చిట్టిరాజు, జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్రామన్, అన్ని శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

అర్హులకు పక్కా(గా) ఇళ్లు

- హౌసింగ్ డేటాబేస్‌లో ఆధార్ సీడింగ్ తప్పుల సవరణకు అవకాశం
- జగనన్న ఇళ్ల కేటాయింపుల్లో సాంకేతిక సమస్యలకు చెక్
- జిల్లాలో 20వేల మందికి లబ్ధి
- పైలెట్ ప్రాజెక్టుగా మన జిల్లా



నరసన్నపేట: అన్ని అర్హతలు ఉన్నా జగనన్న ఇళ్లు అందుకోలేని వారికి ప్రభుత్వం మళ్లీ అవకాశం కల్పిస్తోంది. హౌసింగ్ డేటా బేస్‌లో ఆధార్ సీడింగ్ తప్పుల వల్ల కొందరికి లబ్ధి చేకూరలేదు. ఇలాంటి వారు జిల్లా వ్యాప్తంగా దాదాపు 15వేల మందికిపైగా ఉన్నారు. ఇప్పుడు వీరందరికీ న్యాయం చేసేందుకు ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. 2004, 2009 సంవత్సరాల్లో వివిధ గృహ నిర్మాణ స్కీముల్లో ఇళ్లు ఇచ్చేందుకు హౌసింగ్ డేటా బేస్‌లో ఆధార్ నమోదు చేశారు. ఇళ్లు కూడా మంజూరు చేశారు. అయితే అప్పట్లో వారు నిర్మించుకోలేదు. కొందరు పునాదులు వేశారు. మరికొందరు గోడలు నిర్మించారు. వీరికి ఎలాంటి బిల్లులు చెల్లించలేదు. ఇప్పుడు వీరికి కొత్తగా ఇళ్లు మంజూరు చేసినా బిల్లులు ఇచ్చేందుకు ఆన్‌లైన్‌లో సమస్యలు వస్తున్నాయి. బిల్లులు చెల్లించామని, కొందరు పదిబస్తాలు సిమ్మెంట్ తీసుకున్నారని ఆన్‌లైన్‌లో చూపుతోంది. ఎట్టకేలకు ఈ సమస్యను పరిష్కరించనున్నారు.

ఫలించిన మంత్రులు, ఎమ్మెల్యేల కృషి

జిల్లాలో హౌసింగ్ డేటా బేస్‌లో(సాంకేతిక సమస్యలు) ఆధార్ సీడింగ్‌లో లోపాల వల్ల అనేక మంది లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులను జిల్లా మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి తదితరులు పలు మార్లు సంబంధిత మంత్రితో పాటు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఇలాంటి వారికి న్యాయం చేసేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. రాష్ట్రంలో మూడు జిల్లాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. దీంట్లో శ్రీకాకుళం జిల్లాకు అవకాశం లభించింది. ఇందులో భాగంగా ఆధార్ సీడింగ్‌లో లోపాల వల్ల నిజమైన లబ్ధిదారులు ఉంటే సర్వే నిర్వహించి వారి వివరాలు సేకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు జి.లక్ష్మయ్య ఆదేశాలు జారీ చేశారు.

సర్వేకు సిద్ధం

- ఈ డేటా సరి చేసేందుకు పంచాయతీ కార్యదర్శి ద్వారా గ్రామాల్లో నోటిఫికేషన్ జారీ చేస్తారు.
- అర్హులైన లబ్ధిదారులు ఉంటే తెలియజేయాలని సచివాలయాల్లో నోటీస్ బోర్డుల్లో అభ్యర్థనను ప్రదర్శిస్తారు. అనంతరం సర్వే నిర్వహిస్తారు.
- సర్వే బృందాల్లో పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, విద్యుత్‌శాఖ ఎనర్జీ అసిస్టెంట్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ నుంచి ప్రతినిధి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, హౌసింగ్ శాఖ నుంచి వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉంటారు.
- అన్ని కోణాల్లో పరిశీలించిన తర్వాత లబ్ధిదారులు అర్హులని తేలితే తన సొంత స్థలంలో ఇంటిని నిర్మించుకునేందుకు ఇంటి స్థలాన్ని పంచాయతీ కార్యదర్శి జియో ట్యాగింగ్ చేస్తారు. ఒక వేళ లబ్ధిదారుడికి సొంత స్థలం లేకుంటే 90 రోజుల హౌసింగ్ ప్రోగ్రాం కింద ఇంటి స్థలాన్ని మంజూరు చేయాలని సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు.



మంచి పరిణామం



అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న ఇల్లు ఇవ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ఇందులో భాగంగా హౌసింగ్ డేటా బేస్‌లో ఆధార్ సీడింగ్‌లో పొరపాట్ల వల్ల ఇల్లు పొందలేకపోతున్న వారికి న్యాయం చేయాలని గతంలో నేను ఉప ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సీఎం దృష్టికి తీసుకువెళ్లాను. దీనిపై సీఎం సానుకూల నిర్ణయం తీసుకోవడం మంచి పరిణామం. అర్హులందరికీ వీరికి న్యాయం జరుగుతుంది.

– ధర్మాన కృష్ణదాస్, నరసన్నపేట ఎమ్మెల్యే

సర్వేకు సిద్ధమవుతున్నాం



అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేసినా కొందరికి బిల్లులు చెల్లించడంతో సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇలాంటి వారికి న్యాయం చేసేందుకు సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నారు. అధికారులు సర్వేకు సిద్ధమవుతున్నారు.

– అప్పారావు, డీఈఈ, గృహ నిర్మాణ శాఖ

వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌పై దాడి

- టీడీపీ మాజీ సర్పంచ్ దుశ్చర్య
- కంచిలి మండలం పెద్ద శ్రీరాంపురంలో ఘటన



గాయాలపాలైన పెద్ద శ్రీరాంపురం సర్పంచ్ బల్లెడ సుమన్

కంచిలి : అధికారం దూరమైనా టీడీపీ నాయకులు ఆ దర్పాన్ని మాత్రం వదులుకోలేకపోతున్నారు. అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక ఏకంగా దాడులకు పాల్పడుతున్నారు. కంచిలి మండలం పెద్దశ్రీరాంపురం సర్పంచ్ బల్లెడ సుమన్‌పై ఇలాగే టీడీపీ మా జీ సర్పంచ్ మాదిన రామారావు, కుటుంబ సభ్యులు సోమవారం దాడి చేశారు. పెద్దశ్రీరాంపురం పంచాయతీ సర్పంచ్ బల్లెడ సుమన్.. గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ భవనం నిర్మాణాలకు అవసరమైన మట్టిని స్థానిక జెడ్పీ హైస్కూల్ వెనుక గల చెరువులో తవ్విస్తుండగా, మాజీ సర్పంచ్ మాదిన రామారావు, ఆయన కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. ఇక్కడ చెరువులో మట్టి తవ్వడానికి వీల్లేదంటూ వాదనకు దిగారు.

దీంతో సుమన్, ట్రాక్టర్ నడుపుతున్న సుమన్ తండ్రి ప్రకాశరావులతో మాజీ సర్పంచ్ రామారావు, మిగతా కుటుంబసభ్యులు ఘర్షణ పడ్డారు. ఈ దశలో సర్పంచ్ సుమన్‌పైన మాజీ సర్పంచ్ రామారావు, ప్రణీత్‌లు కర్రతో దాడి చేయడంతో సర్పంచ్ గాయపడ్డారు. తర్వాత సర్పంచ్ సుమన్ ప్రధాన రహదారిపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధి కోసం పనులు చేస్తుంటే దాడి చేశారని ఆరోపించారు. పోలీసులు నచ్చజెప్పడంతో నిరసన విరమించి దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాదిన రామారావు కూడా సర్పంచ్, ఆయన అనుచరులు తమపై దాడి చేశారంటూ ఫిర్యాదు చేయగా.. ఇరు వర్గాలపై పోలీసులు కేసు నమోదు చేశారు.



సంఘటన స్థలం వద్ద గుమిగూడిన ఇరు వర్గాలు

జెడ్పీ చైర్ పర్సన్ పరామర్శ




సుమన్‌ను పరామర్శిస్తున్న పిరియా విజయ, పిరియా సాయిరాజ్

సోంపేట: టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన సర్పంచ్ సుమన్, తదితరులు సోంపేట ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. ఆయనను జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త, మా జీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ పరామర్శించారు. సుమన్‌కు ధైర్యం చెప్పి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మన దాసు, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, పొడుగు కామేష్, బుద్ధాన శ్రీకృష్ణ, రౌతు విశ్వనాథం, బంగారు పాపారావు, నగిరి శరత్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని బడుల్లో విద్యార్థులను చేర్చవద్దు

- డీఈఓ తిరుమల చైతన్య



డీఈఓ తిరుమల చైతన్య

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చేర్పించేముందు తల్లిదండ్రులు ఆ పాఠశాలలకు ప్రభుత్వ గుర్తింపు ఉందో లేదో తెలుసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య సూచించారు. ఆయన సోమవారం డీఈఓ కార్యాలయంలో మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికిగాను జిల్లాలో కొన్ని పాఠశాలలకు ప్రభుత్వం గుర్తింపు/ రెన్యువల్స్ లేవని చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలు డీఈఓ అధికారిక వెబ్‌పోర్టల్ డీఈఓఎస్‌కెఎల్‌ఓఆర్జీలో పొందుపర్చినట్లు తెలిపారు.

త్వరలోనే మూసేస్తాం..


2023–24 విద్యా సంవత్సరానికిగాను జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు/ రెన్యువల్స్ లేని పాఠశాలలను త్వరలో మూసివేయడంతో పాటు సీజ్ చేస్తామ ని డీఈఓ స్పష్టం చేశారు. త్వరలో అన్ని పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపడతామన్నారు. గుర్తింపు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి, అధికారులు, కార్యాలయాల చుట్టు తిరిగినా ఎలాంటి ప్రయోజనం ఉండదని డీఈఓ పేర్కొన్నారు.

అప్రమత్తతే రక్షణ కవచం



సరుబుజ్జిలి: మండుతున్న ఎండల నుంచి ఉపశమనం ఇస్తూ జల్లులు జిల్లాను పలకరించాయి. కానీ ఇదే సమయంలో అకస్మాత్తుగా వచ్చి పడుతున్న పిడుగులు ప్రాణాలను బలిగొంటున్నాయి. ఖరీఫ్ పనులు మొదలు కావడంతో రైతులంతా పొలాలకు వెళ్తుంటారు. పశువుల కాపరులు కూడా కొండ ప్రాంతాలకు వెళ్తుంటారు. వీరికి పిడుగుపాట్లతో ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అయితే కాస్త అప్రమత్తంగా మెలిగితే ప్రమాదం బారి నుంచి బయటపడవచ్చు.


ఏం చేయాలి..?



- ఉరుములు, మెరుపులతో వానలు పడేటప్పుడు చెట్ల కింద ఉండకూడదు.
- మేఘ గర్జనలు వినిపించినప్పుడు పొలాల నుంచి వెళ్లిపోవడం ఉత్తమం.




- గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు బయటకు వెళ్లకుండా ఇంటి పట్టున ఉండడం మేలు.



- మెరుపులు కనిపిస్తున్నప్పుడు సెల్‌ఫోన్లలో ఆటలు ఆడుకోవడం, ఇయర్ ఫోన్ పెట్టుకుని డాబాలపై తిరగడం వంటివి చేయకూడదు.
- మెరుపు కనిపించిన 30 సెకన్లు లేదా అంత కంటే తక్కువ సమయంలో ఉరుము వినిపిస్తే మనకు 10 కిలోమీటర్ల దూరంలో పిడుగు పడే అవకాశం ఉంటుంది.
- ఇంటిలో ముఖ్యమైన ఎలక్ట్రికల్ వస్తువులను సమయం చూసి ఆఫ్ చేయడం, ప్లగ్ కనెక్షన్ తీసి ఉంచడం వంటివి చేయాలి.



ప్రథమ చికిత్స చేయాలి



పిడుగుపాటుకు గురైన వ్యక్తిని వెంటనే పొడి ప్రదేశంలో తిన్నగా పడుకోబెట్టాలి. తడి బట్టలు తీసివేయాలి. తలను ఒక పక్కకు తిప్పాలి. రెండు కాళ్లను ఒక అడుగుపైకి ఎత్తాలి. గాలి తగిలే ప్రదేశంలో ఉంచి అవసరమైతే నోటి ద్వారా గాలి ఊది ప్రథమచికిత్స చేయాలి. సకాలంలో ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించాలి.

– యండ భవ్యశ్రీ, వైద్యాధికారి, సరుబుజ్జిలి

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



పిడుగుపాటుకు గురైన శిమ్మ తవుడు

పోలాకి: మండలంలోని చీడివలస పంచాయతీ పరిధి మాకివలస గ్రామానికి చెందిన శిమ్మ తవుడు(49) సోమవారం ఉదయం పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. వేకువజామున బహిర్భూమికి వెళ్లిన తవుడుపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మహాలక్ష్మి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తవుడు మృతదేహాన్ని నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబాన్ని ఎంపీపీ ముద్దాడ దమయంతి పరామర్శించి ధైర్యం చెప్పారు.

కుశాలపురంలో..

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురంలో గురుగుబెల్లి అమ్మన్న, పైడి ప్రభావతి ఇళ్లపై సోమవారం వేకువజామున పిడుగులు పడ్డాయి. శ్లాబుపై పడటంతో ఇంటిలోని కుటుంబ సభ్యులు భయాందోళన చెందారు. శ్లాబుపై ఉన్న పిట్టగోడలు దెబ్బతిని, నిర్మాణాలు పగిలాయి.

ఇంటిపై పిడుగు ...



పిడుగు పాటుకు విరిగిన శ్లాబ్‌పై గోడ

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేటలో కారాడ కొండలరావు ఇంటిపై సోమవారం పిడుగు పడింది. శ్లాబు బీటలు ఇవ్వగా, శ్లాబ్‌పై ఉన్న గోడ ధ్వంసమైంది. ఇంటిలోని ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోయాయి.

గాలులకు విరిగిన విద్యుత్ స్తంభాలు



గుంటుకుపేట వద్ద విరిగిపోయిన హెచ్‌టీ లైన్ విద్యుత్ స్తంభం

లావేరు: మండలంలో సోమవారం వేకువజామున వాన కురవడంతో పాటు ఈదురుగాలులు వీచాయి. ఈ గాలులకు గుంటుకుపేట, చిన్నయ్యపేట, బుడతవలస గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో హెచ్‌టీ, ఎల్‌టీ లైన్లకు సంబంధించిన విద్యుత్ స్తంభాలు విరిగి పడిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. అనంతరం విద్యుత్‌శాఖాధికారులు మరమ్మతులు నిర్వహించి కరెంటు సరఫరా పునరుద్ధరించారు.

అమ్మకు అర్చన



గుజరాతీపేటలోని రాజరాజేశ్వరీ మహాత్రిపురసుందరీ దేవీపీఠంలో వారాహి అమ్మవారి నవరాత్రి పూజలు ఘనంగా సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు పూజలు జరుగుతాయని పీఠం నిర్వాకులు పెంట రామచంద్రశేఖరశర్మ తెలిపారు.

– శ్రీకాకుళం కల్చరల్

కన్నులపండువగా జగన్నాథుని నేత్రోత్సవం



పట్టణంలోని గుజరాతీపేటలో గల జగన్నాథ స్వామి దేవాలయంలో సోమవారం నేత్రోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు పెంట వంశీయుల ఆధ్వర్యంలో ఈనెల 20నుంచి జగన్నాథ స్వామి ఉత్సవాలు జరుగనున్న సందర్భంగా స్వా మివారి కళావాహనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో రథయాత్ర నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఈఓ శ్యామలరావు తెలిపారు. అలాగే బొందిలీపురం, ఇచ్ఛాపురంలోని జగన్నాథస్వామి దేవాలయాల్లో కళావాహనం చేసిన నేత్రోత్సవాన్ని నిర్వహించారు. శ్రీకాకుళం కల్చరల్

విత్తనం.. రైతుదే పెత్తనం



రైతన్నలకు మేఘ సందేశం అందింది. జిల్లావ్యాప్తంగా పొలం పనులు మొదలైపోయా యి. ఖరీఫ్‌కు రైతులు సన్నద్ధమవుతుండగానే ప్రభుత్వం విత్తనాల పంపిణీ మొదలు పెట్టింది. టెక్కలి మండలం అక్కవరం ఆర్‌బీకేలో సర్పంచ్ జి.మోహన్‌రెడ్డి, నాయకులు పి.అప్పలనాయుడు ఇలా సోమవారం విత్తనాలు పంపిణీ చేశారు. – టెక్కలి


కమలమ్మ నేత్రాలు సజీవం



శ్రీకాకుళం హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసముంటున్న వాసిరెడ్డి కమలమ్మ సోమ వారం మృతిచెందారు. ఆమె కుటుంబ సభ్యుల అనుమతితో నేత్రాలు సేకరించినట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. రెడ్‌క్రాస్ మగ టపల్లి కల్యాణ నేత్రసేకరణ కేంద్రం సిబ్బంది వెళ్లి ఆమె కార్నియాను సేకరించారు.

– శ్రీకాకుళం కల్చరల్

కూర్మనాథుని హుండీ ఆదాయం రూ.14,98,411



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

శ్రీకూర్మనాథాలయంలోని హుండీ ఆదాయం రూ.14,98,411లు వచ్చిందని ఆలయ ఈఓ జి.గురునాథం తెలిపారు. ప్రధాన ఆలయంతో పాటు సమీపంలోని పాతాళ సిద్దేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించామని, 96 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందన్నారు. లెక్కింపులో ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామ నృసింహాచార్యులు. పాలకమండలి సభ్యుడు డబ్బీరు వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు. –గార

క్లుప్తంగా

అక్రమ తవ్వకాలపై దాడులు



అక్రమ తవ్వకాల్లో సీజ్ చేసిన జేసీబీ, ట్రాక్టర్లు

నందిగాం: మండలంలోని కవిటి అగ్రహారం లోని మెట్టపై అక్రమంగా రాళ్ల తవ్వి తరలిస్తున్న వారిపై సోమవారం మైన్స్, విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. కవిటి అగ్రహారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 105లో 13.6 ఎకరాల మెట్ట ఉంది. ఈ మెట్టపై గత కొద్ది రోజులుగా కొంతమంది అక్రమంగా రాళ్ల తవ్వి తరలిస్తున్నారు. సోమవారం మైన్స్ ఏజీ సురేష్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ నాగేంద్ర, విజిలెన్స్ సీఐ అప్పలనాయుడు, సిబ్బంది, స్థానిక వీఆర్వో దశరథ ఆకస్మాత్తుగా దాడి చేసి స్పాట్‌లో ఉన్న రెండు జేసీబీలు, ఐదు ట్రాక్టర్లను సీజ్ చేశారు. వీటిని నందిగాం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీఆర్వో దశరథ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్‌ఐ మహమ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేశారు.

‘ప్రణాళికాబద్ధంగా సాగు’

టెక్కలి: ఈ ఖరీఫ్ సీజన్‌లో టెక్కలి డివిజన్‌లో వ్యవసాయం ప్రణాళికాబద్ధంగా జరిగేలా అధికారులు చొరవ చూపాలని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ, వంశధార అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పుష్కలంగా విత్తనాలు, ఎరువులు అందేలా చూడాలని అన్నారు. అలాగే భూసార పరీక్షలకు అనుగుణంగా ఆయా పంట భూములకు ఎలాంటి విత్తనాలతో అధిక దిగుబడులు వస్తాయో అవగాహన కల్పించాలని తెలిపారు. కౌలు రైతులకు అందజేయనున్న పంట సాగు హక్కు పత్రాలపై ఆయా భూముల యజమానులకు, కౌలు రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

కొత్తమ్మ తల్లి ఆదాయం బ్యాంకులో డిపాజిట్

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఆలయ ఆదాయాన్ని బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆలయానికి నిత్యాన్నదానం కోసం విరాళాలు, మూలనిధి వడ్డీ ద్వారా వచ్చిన ఆదాయం రూ.5లక్షలను కోటబొమ్మాళి యూనియన్ బ్యాంకులో సోమవారం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రూ.15,99,439లు ఎఫ్‌డీ చేశామని ఆయన పేర్కొన్నారు.

విపత్తులు ఎదుర్కొనేందుకే శిక్షణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: విపత్తులు ఎదుర్కొనేందుకు శిక్షణ ఉపకరిస్తుందని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. ఆపద మిత్ర వలంటీర్ల శిక్షణ కార్యక్రమం ముగింపు అనంతరం వారికి సోమవారం కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 12 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు జరిగాయన్నారు. ఏటా విపత్తులు సంభవించేటప్పుడు ప్రాణ, ఆస్తినష్టాలను తగ్గించడానికి వలంటీర్ల సాయం తీసుకుంటామని చెప్పారు. మొదటి విడతలో మొత్తం 86 మంది వలంటీర్లు, రెండో విడత శిక్షణలో 100 మంది మూడో విడతలో 80, నాల్గో విడతలో 84 మంది వలంటీర్లు శిక్షణలో పాల్గొన్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం 350 మంది శిక్షణ పొందారన్నారు.

డీఈఈ సెట్‌లో రమ్యకు 23వ ర్యాంకు



పొందూరు: ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన డీఈఈ సెట్ ఫలితాల్లో మండలంలోని బురిడి కంచరాం గ్రామానికి చెందిన మీసాల రమ్య 23వ ర్యాంకు సాధించింది. రాష్ట్ర స్థాయిలో బయోలాజికల్ సైన్స్ విభాగంలో 23వ ర్యాంకు సాధించింది. ఈమె తల్లిదండ్రులు రామలక్ష్మి కోటేశ్వరరావులు వ్యవసాయ కూలీలు.

మారిన బతుకులు

- పరివర్తన్–2.0 కింద ఆరుగురికి డీఆర్‌డీఏ లోన్లు
- గౌరవంగా బతుకుతామంటున్న లబ్ధిదారులు



రూ. 3.90 లక్షల నగదు చెక్కును అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : సమాజంలో చెడుదోవన వెళ్తున్న వారికి దండించడం ఓ మార్గం. వారి బతుకు బాటను మార్చుతూ చర్యలు తీసుకోవడం మరోమార్గం. జిల్లా పోలీసులు రెండో మార్గాన్ని ఎంచుకున్నారు. సారా తయారీ, రవాణా, క్రయవిక్రయాలు చేసే వారిని పట్టుకుని వారిని మార్చడానికి ప్రభుత్వం ఆపరేషన్ పరివర్తన్–2.0 చేపట్టింది. కార్యక్రమంలో భాగంగా వారికి ఉపాధి కల్పించాలని నిర్ణయించింది. ఆ మేరకు సత్ప్రవర్తనతో ప్రత్యామ్నాయ జీవనోపాధి పొంది ఆదర్శంగా నిలవాలని ఎస్పీ జీఆర్ రాధిక పిలుపునిచ్చారు. అలా ముందుకు వచ్చిన ఆరుగురికి రూ. 3.90 లక్షలు చెక్కు, ధ్రువీకరణ పత్రాలను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశాలతో సెబ్ జేడీ విజయ నాగ మణికంఠ, డీఆర్‌డీఏ డైరెక్టర్ డీపీ విద్యాసాగర్‌ల సమక్షంలో ఎస్పీ సోమవారం అందజేశారు. ఇలా 20 మందిని గుర్తించామని, అందులో ఆరుగురికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశం డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ తరఫున అర్హత ఉండటంతో అధికారులతో కలిసి ఈ సొమ్ము లోనుగా ఇప్పించామన్నారు. మంచి వ్యాపారాలు చేసుకుని గౌరవంగా బతకాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఇచ్చిన రుణంతో జీవనం సాగించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. రుణం పొందిన తర్వాత తిరిగి బ్యాంకుకు చెల్లించిన నాడే మరోసారి బ్యాంకులు ఎక్కువ రుణాలిచ్చేందుకు ముందుకొస్తాయన్నారు. అనంతరం లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తూ యూనిట్‌కు నిర్దేశించిన లోను మొత్తం బ్యాంకువారు జమచేస్తారన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణరావు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ సూపరింటెండెంట్ కేపీ గోపాల్, సీఐ నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

కిరాణా షాపుగా మారుస్తా..



నా గతం ఓ పీడకల.. మర్చిపోదామనుకున్నా. నేను ప్రస్తుతం చిన్న పాన్‌షాపు నడుపుతున్నాను. రూ. లక్ష లోను జిల్లా కలెక్టర్, ఎస్పీ సార్లు ఇప్పించారు. వచ్చిన డబ్బులతో కొద్దిగా పెద్దదిగా కిరాణాషాపుగా మారుద్దామనుకుంటున్నా.

– సుబుది రాజు, సోంపేట

దినసరి కూలీగా ఉన్నా..



దినసరి కూలీగా పనిచేస్తున్నా. చాలీ చాలని డబ్బులతో కుటుంబాన్ని ఈదడం కష్టంగా ఉంది. రూ. 40 వేలు లోను ప్రభుత్వం ఇప్పించింది. దీంతో చిన్న కిరాణా షాపు పెట్టుకుంటా.

– నవర సోమేశ్వరరావు, కొత్తూరు మండలం

కిరాణా షాపు నడుపుతా..



గతంలో నేను నాటుసారా అమ్మకంలో దొరికిపోయాను. సంఘంలో గౌరవంగా బతుకుదామనుకుంటున్నా. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు మా గురించి ఆలోచించి లోను రూ. లక్ష ఇప్పించారు. దీంతో నేను కిరాణాషాపు నడిపి అందులో జీడిపిక్కల వ్యాపారం చేద్దామనుకుంటున్నా.

– లాభాల మీనాక్షి, లింగుపురం, మెళియాపుట్టి మండలం

మేకలు కొనుక్కుంటా..



నాటుసారా అమ్ముతూ పట్టుబడ్డాను. మా ఏరియా పోలీసులు మారాలన్నారు. నాకు గవర్నమెంటు లోను ఇప్పించారు. రూ. 50 వేలు దొరుకుతుంది. నా దగ్గర మరి కొంత సొమ్ము ఉంది. దాంతో మేకలు, గొర్రెలు కొని జీవనం సాగిస్తా.

– కాకర్ల దాలయ్య, కంచిలి మండలం, ఇచ్ఛాపురం

ఆదిత్యుని ఆలయ భూముల వేలం నేడు

- తొలి దశలో 26.55 ఎకరాల వ్యవసాయ భూముల గుర్తింపు
- నేడు ఐదు గ్రామాల్లో ఒకే రోజున వేలం ప్రక్రియ



వేలానికి సిద్ధమైన అరసవల్లి సమీపంలోని భూములు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ భూములను మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బహిరంగ వేలం వేయనున్నారు. ఈ ఆలయానికి చెందిన సుమారు 26.55 ఎకరాల వ్యవసాయ భూములను లీజు విధానం ద్వారా సేద్యం చేసుకునేందుకు మూడేళ్ల కౌలు హక్కుల కోసం టెండర్ కం బహిరంగ వేలం ప్రక్రియను ఆయా ఊళ్లలో నిర్వహించనున్నారు. దీంతో ఆలయానికి 2023–24 నుంచి 2025–26 వరకు కౌలు హక్కుదారుల నుంచి మరింత ఆదాయం సమకూరనుంది.

అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామికి మొత్తం 83.99 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. అయితే వీటిలో 53.24 ఎకరాల భూములు ఆలయ అర్చకులకు జీతాలకు బదులుగా వారి ఆధీనంలో ఉండేలా దేవదాయ శాఖ ఉన్నతాధికారులు గత కొన్ని దశాబ్దాల కిందటే అప్పగించి ఉన్నారు. ఇక మిగిలిన భూమిలో ఏపీ టూరిజం హోటల్‌కు 1.48 ఎకరాలు, టీటీడీ కల్యాణ మండపానికి 1.20 ఎకరాలు కేటాయించగా, మాస్టర్ ప్లాన్ అమలులో ఇళ్ల బాధితులకు 0.16 సెంట్లలో కొత్త ఇళ్ల కోసం కేటాయింపులు చేశారు. దీంతో మిగిలిన 27.91 ఎకరాల భూముల్లో తొలి దశలో 26.55 ఎకరాల వ్యవసాయ భూములను వేలం ద్వారా కౌలు హక్కుల కింద మూడేళ్ల పాటు ఇవ్వనున్నారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి బహిరంగ వేలం వేస్తూ.. ఆదాయాన్ని పెంపొందించుకోవాల్సి ఉంది. అయితే 2007లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఆలయ భూములను వేలం ప్రక్రియ వేయగా.. తర్వాత వచ్చిన ప్రభుత్వాల హయాంలో ఈ ప్రక్రియను కొనసాగించలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో ఈ భూములకు భూముల వేలం ద్వారా ఆలయాల భూముల సంరక్షణకు కృషి చేశారు. మళ్లీ నిబంధనల ప్రకారం మూడేళ్ల కాలపరిమితి మించిన కారణంగా తాజాగా మంగళవారం ఈ భూములకు బహిరంగ వేలం ప్రక్రియను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు అరసవల్లి, వప్పంగి, వాడాడ, రాయిపాడు, చింతాడ తదితర గ్రామాల్లో ఉన్న భూములకు ఆయా పంచాయతీల పరిధిలోనే వేలం నిర్వహించేలా చర్యలు చేపట్టారు.

బహిరంగ వేలం భూములివే...

- అరసవల్లి ఆలయ భూముల్లో తొలివిడతలో మొత్తం 26.55 ఎకరాల భూములను మంగళవారం ఒక్క రోజునే ఆయా భూములున్న గ్రామాల్లోనే వేలం ప్రక్రియను నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేశారు.
- అరసవల్లి సమీపంలో ఉన్న 0.60 సెంట్లు, 0.50 సెంట్లు విస్తీర్ణం గల భూములను వేలం ప్రక్రియను మంగళవారం ఉదయం 8 గంటలకు స్థానిక ఆదిత్యాలయంలో నిర్వహించనున్నారు. అలాగే ఉదయం 10 గంటలకు వప్పంగి గ్రామ పరిసరాల్లో ఉన్న 3.54 ఎకరాలు, 2.37 ఎకరాలు, 1.38 ఎకరాలు, 5.32 ఎకరాలు, 8.99 ఎకరాల భూములను వప్పంగిలోని శ్రీ ఉమారామలింగేశ్వర ఆలయం వద్ద, మధ్యాహ్నం 12 గంటలకు వాడాడ గ్రామ పరిసరాల్లో ఉన్న 1.25 ఎకరాల వ్యవసాయ భూమిని వాడాడలోని శ్రీవల్లభనారాయణ స్వామి వారి ఆలయం వద్ద, మధ్యాహ్నం 2 గంటలకు రాయిపాడు పరిసరాల్లో ఉన్న 2 ఎకరాల భూమిని రాయపాడులోని శ్రీరామమందిరం వద్ద, సాయంత్రం 4 గంటలకు చింతాడ గ్రామ పరిసరాల్లోని 0.60 సెంట్ల భూమిని చింతాడలోని శ్రీరామ మందిరం వద్దనే బహిరంగ వేలం వేసేలా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ షెడ్యూల్‌ను ప్రకటించారు.

పూర్తి పారదర్శకంగా వేలం ప్రక్రియ



అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి చెందిన 26.55 ఎకరాల భూములకు ఈనెల 20న పూర్తి పారదర్శకంగా బహిరంగ వేలం ప్రక్రియ నిర్వహించనున్నాం. దీని ద్వారా రైతులకు రానున్న మూడేళ్ల పాటు సేద్యం చేసుకునే అవకాశం కల్పించనున్నాం. అయితే ఈ వేలం ప్రక్రియలో హిందువులు మాత్రమే హాజరుకావాలనే నియమాన్ని కచ్చితంగా అమలు చేస్తున్నాం. అలాగే రైతులందరికీ సమాచారం ఇచ్చాం.

– వి.హరిసూర్యప్రకాష్, ఆలయ ఈఓ

తోటకు వెళ్లి.. తిరిగి రాని లోకాలకు

- మంటల్లో చిక్కుకుని వృద్ధుల దుర్మరణం
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



మృతి చెందిన నర్సింహ అప్పారావు, సరోజిని (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని సంతసీతారాంపురం పంచాయతీ చినరావుపల్లి గ్రామ పొలాలకు సమీపంలోని కారి చెరువులో ఉపాధి పనులు జరుగుతున్నాయి. సోమవారం ఉదయం వేతనదారులు హడావుడిగా చెరువు పనులకు వెళ్తున్నారు. ఆ దారి వెంబడి వెళ్తున్న వారిని పక్కనే నీలగిరి తోటలో కనిపించిన దృశ్యాలు భయపెట్టాయి. ఒకరి మృతదేహం కాలిపోయి కనిపించడంతో హత్య ఏమైనా జరిగిందా అని అంతా అనుమానపడ్డారు. నిశితంగా పరిశీలిస్తే ఆ మృతదేహానికి సమీపంలో మరో మృతదేహం కనిపించడంతో అందరిలోనూ అలజడి మొదలైంది. ఊరంతా విషయం తెలిసి, పోలీసులకు సమాచారం అంది దర్యాప్తు మొదలుపెడితే చనిపోయింది గ్రామానికి చెందిన గురుగుబెల్లి నర్సింహ అప్పారావు (75), గురుగుబెల్లి సరోజిని(72) అని తెలిసింది. ఈ వృద్ధ దంపతులు మంటల్లో చిక్కుకుని చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. స్థానికులు, పోలీసులు అందించిన సమాచారం మేరకు..

చినరావుపల్లికి చెందిన నర్సింహ అప్పారావు, సరోజిని దంపతులకు ఎకరాన్నర పొలం ఉంది. అందులో నీలగిరి చెట్లను ఈ మధ్యనే కోసి విక్రయించారు. ఈ కోసిన తోటలో వ్యర్థాలు అలాగే ఉండిపోయాయి. ఈ వ్యర్థాలు తగలబెట్టేందుకు దంపతులు ఆదివారం పొలానికి వెళ్లారు. ఆదివారం నాడు వేడి చాలా తీవ్రంగా ఉంది. దానికి తోడు గాలులు కూడా బాగా వీచాయి. అయినా వీరిద్దరూ తోటలోకి వెళ్లారు. వ్యర్థాలకు నిప్పు పెట్టిన దంపతులు ఇంటికి తిరిగి రాలేదు. సోమవారం ఉపాధి వేతనదారులు చూసేసరికి విగతజీవులై కనిపించారు. తోటలో మంటల్లో చిక్కుకుని చనిపోయి ఉంటారని భావిస్తున్నారు.

ఎచ్చెర్ల ఎస్‌ఐ వి.సత్యనారాయణ సంఘటన స్థలం పరిశీలించి, మృతదేహాలను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. వీరి పెద్ద కుమారుడు వెంకటలక్ష్మణరావు హైదరాబాద్‌లోని ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. చిన్నకొడుకు నాగరాజు సైతం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ప్రైవేట్ పరిశ్రమలో సెక్యూరిటీ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నాడు. వీళ్లకు సమాచారం అందించారు. వృద్ధ దంపతులు మాత్రమే ఇంటిలో ఉండేవారు. ఒకరికి ఒకరుగా బతికిన వీరిద్దరూ ఒకే సారి కన్నుమూయడంతో గ్రామమంతా విషాద ఛాయలు అలముకున్నాయి.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

ఇచ్ఛాపురం: వక్ఫ్ బోర్డు స్థలంలో జరిగిన ఆక్రమణలను తొలగించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయనున్నట్లు వక్ఫ్ బోర్డు స్పెషల్ టాక్స్ బోర్డు అధికారి ముసాబిన్ ఇబ్రహీం, ఎగ్జిక్యూటివ్ అధికారి అబ్దుల్ కుద్దూస్ తెలిపారు. పట్టణంలోని వక్ఫ్ బోర్డుకి చెందిన ఆస్తులను పరిశీలించి వాటిపై అధికారులు ముస్లి పెద్దలతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీర్లపంజా భూముల ఆక్రమణలు, ముతవల్లిపై వచ్చిన ఫిర్యాదు మేరకు మతపెద్దలందరితో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో షాదీ ఖానా ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించారు.

యోగా అవగాహన పోస్టర్ విడుదల



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ నవీన్, ఇతర అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంతర్జాతీయ యోగా దినోత్సవంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. యోగా దినోత్సవ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 21న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. ఈ ఏడాది వసుధైక కుటుంబం నినాదంతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

‘టాపర్లకు అండగా ఉంటాం’



వరుణ్ చక్రవర్తికి శాలువా కప్పుతున్న ఎమ్మెల్యే

నరసన్నపేట: పలు పోటీ పరీక్షల్లో టాపర్లుగా నిలుస్తున్న విద్యార్థులకు వైఎస్ జగన్ సర్కారు అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేట నియోజకవర్గం పోలాకి మండలానికి చెందిన బోర వరుణ్ చక్రవర్తి జిల్లా ఖ్యాతినే కాకుండా రాష్ట్ర గౌరవాన్ని నిలిపారని ఎమ్మెల్యే అన్నారు. నీట్ పరీక్షలో దేశంలోనే మొదటి ర్యాంకు సాధించిన వరుణ్ చక్రవర్తికి స్థానిక ఒక కల్యాణ మండపంలో సోమవారం సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక మధ్య తరగతి కుటుంబానికి చెందిన వరుణ్ చక్రవర్తి తన కృషితో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ ఘనత సాధించారని అభినందించారు. సీఎంతో కలిపిస్తాను అని చక్రవర్తికి మాట ఇచ్చారు. ఈ సందర్భంగా పాతపట్నంకు చెందిన రామరాజు ట్రస్టు ఆధ్వర్యంలో కూడా చక్రవర్తిని సన్మానించారు. అలాగే ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావులు కూడా వేర్వేరుగా సత్కరించారు.

‘వేతన సవరణ వెంటనే అమలు చేయాలి’



డీసీసీబీ వద్ద ధర్నా చేస్తున్న సహకార సంఘ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: వేతన సవరణను వెంటనే అమలు చేయాలని ప్రాథమిక సహకార సంఘాల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.రంగనాథ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, శ్రీకాకుళం సహకార సంఘ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎల్.మోహన్‌రావు, బి.రామారావులు డిమాండ్ చేశారు. సోమవారం శ్రీకాకుళంలోని దండివీధి వద్దనున్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఎదుట పీఏసీఎస్ ఉద్యోగులు, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ 90 ప్రకారం వేతనాలను, ఇతర బెనిఫిట్లను వెంటనే అమలు చేయాలని, ఏప్రిల్ 1, 2016 నుంచి మోనటరీ బెనిఫిట్స్ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యూటీని చట్ట ప్రకారం అమలు పరచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సహకార బ్యాంకు, జిల్లా కేంద్ర బ్యాంకులు కలసి డి స్ట్రిక్ట్ లెవెల్ సపోర్ట్ ఫండ్ ఏర్పాటు చేయాలన్నారు. సహకార సంఘాలలోని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. అనంతరం డీసీసీబీ సీఈఓ డి.వరప్రసాదరావుకు యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.

సముద్రతీరంలో కూలిన సర్వే డ్రోన్



భేతాళపురం తీరంలో కూలిన సర్వే డ్రోన్

మందస: మండలంలోని ఉద్దాన ప్రాంతమైన రాంపురం పంచాయతీలో బిడిమి గ్రామంలో జగనన్న శాశ్వత భూహక్కు పథకం కింద రీసర్వేను సోమ వారం ప్రారంభించారు. అయితే డ్రోన్ ఎగరేశాక సాంకేతిక కారణాలతో అది కూలిపోయింది. దీంతో వీఆర్వో జె.తులసీదాసు, సర్వే ఆఫ్ ఇండియా టీం సర్వేయర్ వేముల ప్రసాదరావు, సర్వేయర్ సాలీన సుందరరావు, టాస్క్‌ఫోర్స్ సర్వేయర్ శ్రీను, విలేజ్ సర్వేయర్లు గోపి, శంకర్, ప్రశాంత్ గాలించగా.. భేతాళపురం సమీపంలోని తీరంలో డ్రోన్ శకలాలు కనిపించాయి. కానీ డ్రోన్‌లోని కెమెరా మాత్రం దొరకలేదు. దొరికిన వాటిని ఒక చోట చేర్చి, మందసలోని తహసీల్దార్ కార్యాలయానికి చేర్చారు.

సీఎస్‌డీఎంగా శ్రీనివాస్

శ్రీకాకుళం పాత బస్టాండ్: పౌర సరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్‌గా శ్రీనివాస్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన అన్నమయ్య జిల్లాలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. బదిలీపై జిల్లాకు వస్తున్నారు. మరో రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నారు. ఇప్పటివరకు ఉన్న జిల్లా మేనేజర్ పి.జయంతి సస్పెండ్ అయిన విషయం తెలిసిందే.

బొడ్డేపల్లి శత జయంతి ఉత్సవాల ముగింపు తేదీ మార్పు



పేరాడ తిలక్

టెక్కలి: బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి ఉత్సవాల ముగింపును ఈ నెల 25కు మార్చినట్లు రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ ఓ ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఈ నెల 21న ముగింపు కార్యక్రమం జరగాల్సి ఉందని, కానీ అధికారులు, పెద్దలు అందుబాటులో లేని కారణంగా కలెక్టర్ సూచనల మేరకు 25వ తేదీకి మార్చామన్నారు. 25న ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం 7 రోడ్ల జంక్షన్ వద్ద విగ్రహావిష్కరణ, ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్‌లో సభా కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,070–00
బంగారం(22సి. 10గ్రా.)	55,070–00
వెండి (కిలో)	79,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ.554.00
శ్రీకాకుళం	రూ.554.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹160	₹275	₹ 295

